న్యాయం చేయాలని ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న మలగూరు రైతు

పరిశ్రమలకు భూములిస్తే వీధిన పడతాం...

అధికారుల ముందు కన్నీళ్లు పెట్టుకున్న రైతన్నలు

ప్రజాశక్తి-హిందూపురం

'మా గ్రామంలో ఉన్న శ్మశాన వాటికకు స్థలం తక్కువ ఉండడంతో కుటుంబంలో ఎవరైనా మృతి చెందితే సొంత భూముల్లో పూడ్చుకుని కర్మకాండలను చేసుకుంటాం. భూ సేకరణ పేరుతో మా భూములను ప్రభుత్వం తీసుకుంటే కుటుంబంలో ఎవరైనా మతి చెందితే ఎక్కడ పూడ్చాలో తెలియని అయోమయంలో ఉన్నామ'న్లి హిందూపురం రూరల్ మండలం మలగూరు రైతులు అధికారుల ముందు కన్నీళ్లు పెట్టుకున్నారు. మంగళవారం ఆర్డీవో ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో భూములు కోల్పోతున్న రైతులతో మలగూరు గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఆనంద్ కుమార్ మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు అన్ని విధాల న్యాయం చేయడం కోసమే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. ఇది చివరి సమావేశం కాదని ఇంకా రెండు సమావేశాలు నిర్వహించి, అందరి ఆమోదం మేరకే పరిశ్రమల కోసం భూములు తీసుకుంటామని అన్నారు. దీంతోపాటు రైతులకు మంచి ధర నిర్ణయించి చట్ట ప్రకారం వారికి చెల్లిస్తామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు విన్నవించిన ప్రతి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వివరిస్తామన్నారు. అయితే ఏ పరిశ్రమలు వస్తున్నాయి, ఎంత ధర నిర్ణయించారన్న విషయాలను అధికారులు బహిర్గతం చేయకపోవడంతో కొంతమంది రైతులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

గ్రామసభకు హాజరైన రైతులు

హిందూపురం మండలం మలగూరు గ్రామ రెవెన్యూ పొలంలో సుమారు రెండువేల ఎకరాల భూమికి ఏపీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసి మూడు నెలలు అవుతున్నది. ఇప్పటివరకు ఎకరానికి ఎంత పరిహారం చెల్లిస్తారన్న విషయాలను రెవిన్యూ అధికారుల నుండి స్పష్టత రాలేదు. గత 15 రోజుల క్రితం భూములు కోల్పోయే రైతులకు న్యాయమైన ధర కల్పిస్తామని ఎమ్మెల్యే బాలకృష్ణ పిఎలు గ్రామాలకు వెళ్లి సభలు నిర్వహించి రైతులకు భరోసా ఇచ్చారు. అయితే మంగళవారం మణుగూరు గ్రామంలో భూములు కోల్పోయే రైతులకు ధరలు నిర్ణయిస్తామని రెవిన్యూ అధికారులు చాటింపు వేయించారు. గ్రామ సభకు హాజరైన ఆర్డీవో ఆనంద్ కుమార్ తూతూ మంత్రంగా సభలో మాట్లాడి ఎటువంటి ధరలు ప్రకటించకుండా సభ ముగించుకొని వెళ్ళిపోయారు. తమకు ఉన్న భూములను సాగు చేసుకుని మంచి పంటలు పండించుకునే సమయంలో అన్యాయంగా తమ భూములను లాక్కోవద్దంటూ ఆర్డీవో ఎదుట కొంతమంది రైతులు భోరున విలపించారు. బాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని హంద్రీనీవా ద్వారా నీటిని తీసుకొచ్చారని, ఆ నీటితో చెరువులు నిండి భూగర్భ జలాలు పెరగడంతో బోరు బావులు వేయించుకొని ఇప్పుడిప్పుడే వ్యవసాయం చేస్తున్న తరుణంలో ఇలా ఒక్కసారిగా భూములు లాక్కుంటే తాము అన్యాయం అయిపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న శ్మశాన వాటికకు స్థలం తక్కువ ఉండడంతో ఎవరి భూముల్లో వారు వారి పెద్దలు మృతి చెందితే ఖననం చేసుకుంటారని ఇప్పుడు ఎవరైనా మృతి చెందితే వారి మృతదేహాలను పూడ్చడానికి సైతం స్థలం లేదని కన్నీటి పర్వతమయ్యారు. దీంతో అధికారులు సభను అర్ధాంతరంగా ముగించి వెళ్ళిపోయారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వెంకటేశు, ఇతర రెవిన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మొంథా గుబులు



ఉమ్మడి జిల్లాలో తేలికపాటి వర్షాలు
పంటనష్టంపై రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మొంథా తుఫాను గుబులు రేపుతోంది. రాష్ట్రమంతా తుఫాను వణికిస్తుండగా జిల్లాలో పెద్దగా ప్రభావం ఇప్పటి వరకు కనిపించలేదు. అయితే మంగళవారం నుంచి బుధవారం వరకు ప్రభావం ఎక్కువగానే ఉండే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ మేరకు ఓ ప్రకటనలో పేర్కొంది. అందుకు తగ్గట్టు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి పర్యవేక్షణ జరుగుతోంది. సోమవారం రాత్రి మాత్రం ఉరవకొండ, గుంతకల్లు ప్రాంతాల్లో వర్షపాతం నమోదయింది. ఉరవకొండలో అత్యధికంగా 80.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. గుంతకల్లులో 53.2 మిల్లీమీటర్లు పడింది. రాయదుర్గం 45.4 మిల్లీమీటర్లు, శెట్టూరు 39.2 మిల్లీమీటర్లు, బొమ్మహాల్ 22.4 మిల్లీమీటర్లు, బ్రహ్మసముద్రం 20 మిల్లీమీటర్లు అత్యధికంగా నమోదయింది. తక్కిన ప్రాంతాల్లో తేలికపాటి చిరుజల్లులు పడ్డాయి.

రైతుల్లో గుబులు

ఒకవైపు వర్షాభావం మరోవైపు అధిక వర్షాలు ఈ రెండింటి వలన రైతులకు తీరని నష్టం జరుగుతోంది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని పంట పండించి చేతికొచ్చిన సమయంలో 'మొంథా' తుఫాను గుబులు రేపుతోంది. ఒకవైపు రాయదుర్గం ప్రాంతంలో వరి, ఇతర ప్రాంతాల్లో మొక్కజొన్న పంటలు నూర్పిడి జరుగుతున్నాయి. ఈ సమయంలో వస్తున్న తుఫాను ఏ మేరకు నష్టం చేకూరుస్తుందోనని భయపడుతున్నారు. అసలే వీటికి సరైన గిట్టుబాటు ధరలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు ఈ వర్షాలతో ఆ పంట కూడా దెబ్బతింటే పూర్తిగా నష్టపోయే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన చెందుతుందన్నారు. వేరుశనగ కూడా కాయలు ఏర్పడి ఉన్నాయి. అధిక వర్షాలొస్తే వాటిపైనా ప్రభావం ఉండే అవకాశముందని రైతులు చెబుతున్నారు.

నగర శివార్లలోనూ ఆందోళన

గత వారంలో పడిన అధిక వర్షాలకు అనంతపురం నగర శివార్లలోని కాలనీల్లోకి నీరు చేరింది. దీని నుంచి తేరుకోకముందే మొంథా తుఫాను రావడం నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న వారికి కంటి మీద కునుకు లేకుండా ఉంది. గతంలోనూ అధిక వర్షంతో నగరంలోని అనేక కాలనీలు నీట మునిగిన విషయం తెలిసిందే. ఆ భయం ఇప్పటికీ లోతట్టు ప్రాంతాలవాసుల్లో ఉంది. ఇటీవల పడిన వర్షాలకు తోడు ఇప్పుడు అధిక వర్షం పడితే నీరు ఇళ్లలోకి ఎక్కడ వస్తుందోనని బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. అయితే ఇతర జిల్లాలంత ప్రభావం అనంతపై లేదన్నది ఊరటనిచ్చేదిగా ఉంది.

ఇప్పటికే ప్రధాన జలాశయాల్లో నీరు

అక్టోబరు మాసంలో పడుతున్న వర్షాలకు జలాశయాల్లోకి నీరు వచ్చి చేరుతోంది. గుమ్మగట్ట మండలంలో భైరవానితిప్ప ప్రాజెక్టులో నీరు ఎగువ భాగంలోనున్న కర్నాటక నుంచి నీరు ఎక్కువగా రావడంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఇంకోవైపు పిఎబిఆర్ డ్యామ్‌లో గేట్లు కూడా ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు. మిడ్‌పెన్నార్ డ్యామ్ ఇంకా నిండాల్సి ఉంది. రెండున్నర టిఎంసిల వరకు నీరు ఈ డ్యామ్‌లో రావాల్సి ఉంది.

భైరవానితిప్ప ప్రాజెక్టు నుంచి నీరు విడుదల దృశ్యం



పిఎబిఆర్‌లో నీటి నిల్వ

అభివృద్ధి దిశగా 'పురం' : మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

సినీ నటులు నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రమైన హిందూపురం అభివృద్ధి దిశగా పయనించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లో సచివాలయాల కమ్యూనిటీ కార్యదర్శులతో రూ 92.50 కోట్లు విడుదలైన సందర్భంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ. 92.50 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. నవంబర్ మొదటి వారంలోనే ఈ రూ.92.50 కోట్ల పనులకు సంబంధించి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా చేపట్టే అభివృద్ధి పనులకు ప్రజలతోపాటు ఆయా రాజకీయ పార్టీలు కూడా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున, టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జులు, మున్సిపల్ ఇంజనీర్ దస్తగిరి, డీఈఈ.లు వాణి, లోకేష్, మదన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపిక విమర్శించారు. ఈ మేరకు ఆమె మంగళవారం పట్టణంలోని ముక్కడి పేటలో ఉన్న బీసీ హాస్టల్ ను నియోజవర్గ బీసీ సెల్ నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ లో నెలకొన్న సమస్యలపై విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహం లో అనేక సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. హాస్టల్లో మెనూ కూడా పాటించడం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ ఒకసారి ఈ హాస్టల్లో పరిస్థితి చూస్తే విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రోషన్ అలీ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు నందమూరి నగర్ మోహన్, 7వ వార్డ్ ఇన్‌ఛార్జి అయూబ్ బేగ్, నాయకులు కొల్లప్ప, నాగేంద్ర, బాబాజాన్, జుమాకులపల్లి మూర్తి, కగ్గల్లు మూర్తి, శిరివరం రవి, లేపాక్షి చలపతి శీనప్ప, భాస్కర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఎస్సీ అట్రాసిటీ కేసులు సత్వరం పరిష్కరించాలి

రాష్ట్ర శాసనసభ కమిటీ అధ్యక్షులు వర్ల కుమార్ రాజా

సమావేశంలో పాల్గొన్న శాసన సభ కమిటీ సభ్యులు, అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఎస్సీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎస్సీల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర శాసనసభ కమిటీ అధ్యక్షులు వర్ల కుమార్ రాజా స్పష్టం చేశారు. మంగళవారం పుట్టపర్తి కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ రాష్ట్ర శాసనసభ కమిటీ అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, జెసి మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి లతో కలిసి రాష్ట్ర శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల,కమిటీ సభ్యులు కావలి గ్రీష్మ ప్రసాద్, ఎమ్మెస్ రాజు, విజయ్ చంద్ర బి.ఎన్, రోషన్ కుమార్ సొంగ తదితరులు పాల్గొన్నారు. జిల్లాకు విచ్చేసిన శాసనసభ ఎస్సీ కమిటీ సభ్యులను అధికారులు ప్రజాప్రతినిధులు పూల మొక్కలు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు.అనంతరం సభ్యులకు భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి శాసనసభ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, కలెక్టర్, ఎస్పీ, జేసి, ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే పుట్టపర్తి జిల్లాలో పర్యటించి షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు మరియు షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు ఇచ్చే వినతి పత్రాలు స్వీకరించడం జరిగిందని, ఎస్సీల అభివృద్ధి కోసం రూ. 20 వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించడం జరిగిందని, వారి కోసం ఎస్సీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి వారి అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సబ్ ప్లాన్ నిధుల నుంచి ఎన్‌ఆర్‌ఈజీఎస్ అనుసంధానంతో శ్మశాన వాటిక లకు అప్రోచ్ రోడ్లు, ప్రహరీ, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు పునరావాసం కల్పించడం, ఆర్థికంగా ఆదుకోవడం లాంటి చర్యలను సీరియస్ గా తీసుకోవాలని, తీవ్రత ఎక్కువ ఉన్న కేసులకు సంబంధించి వారి కుటుంబాలకు భూమిని నిబంధనల మేరకు కేటాయించడం, ఇవ్వడం చేయాలని ఆదేశించారు. నూతనంగా ఎస్సీ హాస్టల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందని, మరింత మంది ఎస్సీ విద్యార్థులు హాస్టల్స్ లోకి వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమల శాఖ ద్వారా చిన్న యూనిట్ల స్థాపన కొరకు రూ.1500 కోట్ల ఇన్సెంటివ్స్ ను ప్రభుత్వం కేటాయించిందని, ఇందులో జిల్లాకు అత్యధికంగా రూ.184 కోట్లు కేటాయించడం జరిగిందని చెప్పారు. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు 40 శాతం మేర ఖర్చు చేయాల్సి ఉందని, వీటి ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎస్సీలను ప్రోత్సహించాలని అన్నారు. విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని, దీని ద్వారా వారు క్షేత్రస్థాయిలో పర్యటించి గౌరవ ప్రదంగా సమస్యలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు ప్రతినెల నిర్వహించే సివిల్ రైట్స్ డేలో పాల్గొనాలని, డివిజన్, మండల పరిధిలో అధికారులు క్రమం తప్పకుండా నిర్వహించాలని, అందరూ అధికారులు కూడా ఇందులో పాల్గొనేలా చూడాలని చెప్పారు. రాష్ట్రంలో ఇళ్లు లేని దళితులు ఉండరాదనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని, అందుకు అనుగుణంగా జిల్లాలోని ఎస్సీ కాలనీలలో సచివాలయ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఇల్లు కావాలా, స్థలం, పట్టా కావాలా అని అడగాలని సూచించారు. మూడు నెలల తర్వాత శాసనసభ కమిటీ ఇక్కడికి మళ్లీ రావడం జరుగుతుందని, ఆలోపు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. సమావేశం ప్రారంభంలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పిపిటి ద్వారా ఎస్సీల సంక్షేమానికి జిల్లాలో తీసుకుంటున్న చర్యలను కమిటీ సభ్యులకు వివరించారు. అనంతరం శాసనసభ కమిటీ అధ్యక్షులు, సభ్యులను, జిల్లా కలెక్టర్, ఎస్పీ, సోషల్ వెల్ఫేర్ జెడిలు శాలువా కప్పి సన్మానించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ సుదర్శన్ రెడ్డి, ఆర్డీవోలు, డీఎస్పీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయం పెంచుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

పంచాయతీలు సొంత ఆదాయాలను పెంచుకోవడం ద్వారా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు అభివృద్ధి సాధించవచ్చని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆనందప్రసాద్ తెలిపారు. మంగళవారం హిందూపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సొంత ఆదాయ వనరులపై రెండు రోజుల మండల స్థాయి శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పంచాయతీల్లో సొంత వనరులు ఎలా ఏర్పాటు చేసుకోవాలి, పంచాయతీ అభివృద్ధిలో సొంత ఆదాయ వనరులు యొక్క ప్రాధాన్యత గురించి వివరించారు. శిక్షణలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సిబ్బందికి ఆస్తి, నీటి పన్నుల వసూలు, మార్కెట్ ఫీజులు, వాణిజ్య సముదాయాల అద్దె, లైసెన్స్ ఫీజులు వంటి ఆదాయ వనరులను సమర్థవంతంగా వసూలు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిఓటిలు కెంచచారాయప్ప, గంగాధర్, సర్పంచులు మంజునాథ్, నంజప్ప, రత్నమ్మ శ్రీనివాస్ రెడ్డి, లలిత, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎస్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా గుడ్డం ఆరో వార్డులో జరుగుతున్న శిబిరానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రగతి హాజరై మహిళా సాధికారతపై విద్యార్థులకు వివరించారు. విద్య ద్వారానే మహిళలు అన్ని రంగాల్లో రాణించవచ్చని, సమాజంలో గౌరవంగా బతకడానికి విద్య మాత్రమే దోహదపడుతుందని సూచించారు. 50 మంది వాలంటీర్లను రెండు గ్రూపులుగా విభజించి, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అనే అక్షరాలతో విద్యార్థులంతా క్రమంగా ఏర్పడి ఎన్ఎస్ఎస్ పట్ల తమ ఆసక్తిని చాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ రంగనాయకులు, కళాశాల సీనియర్ అసిస్టెంట్ బి నరసింహులు, కళాశాల ఆఫీసు సిబ్బంది భార్గవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న రత్నాకర్

బాబా శతజయంతి వేడుకలకు సిఎం, డిప్యూటీ సిఎంలకు ఆహ్వానం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు రావాలని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానించారు. ఆయన సోమవారం రాత్రి 10 గంటల సమయంలో విజయవాడలోని సిఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబును కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. నవంబర్ 17 నుంచి 25వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు పాల్గొంటారని సిఎంకు తెలిపారు. అలాగే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. తప్పకుండా హాజరవుతామని వారు చెప్పినట్లు రత్నాకర్ తెలిపారు. రత్నాకర్‌తో పాటు ట్రస్టు సభ్యులు ఉన్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

అప్పులవారి వేధింపులే కారణం

ప్రజాశక్తి - మడకశిర టౌన్

పండ్ల వ్యాపారంలో నష్టం రావడంతో ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వలేని పరిస్థితుల్లో అప్పులవారు ఇంటివద్దకు వచ్చి డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో విధిలేని పరిస్థితిలో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గుడిబండ మండలం దేవరహట్టి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఈఘటనకు సంబంధించి బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు... దేవర హట్టి గ్రామానికి చెందిన మారెక్క, కాంతారాజు దంపతులు బెంగళూరులో పండ్ల వ్యాపారం చేస్తున్నారు. కర్బూజా, పుచ్చకాయ, పండ్లను కళ్యాణ్ దుర్గానికి చెందిన టెంపో వాహనదారులు సరఫరా చేసేవారు. వారికి ఈ దంపతులు రూ.80 లక్షలు బాకీ పడ్డారు. దీంతో నాలుగు రోజులుగా పాతిరెడ్డి తిమ్మారెడ్డి రామాంజి తదితరులు వారి ఇంటివద్దకు వెళ్లి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అందులో భాగంగా రెండు రోజుల క్రితం కారులో కాంతరాజును తీసుకుని వెళ్లి డబ్బులు ఇవ్వాలని బెదిరించి వదిలేశారు. దీంతో కాంతరాజు కుటుంబ సభ్యులు భయపడి గుడిబండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేశారు. రెండు రోజులగా ఇంటివద్దే అనేక మందిని తీసుకొని వచ్చి డబ్బు డిమాండ్ చేయడంతో కొంత సమయం ఇవ్వాలని వేడుకొన్నామని అయితే ఇవ్వకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో పెస్టిసైడ్ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని బాధితులు తెలిపారు. దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడం గమనించిన గ్రామస్తులు వారిని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తీసుకొని వచ్చి చికిత్స అందించారు. ఈసందర్భంగా మారెక్క మాట్లాడుతూ తాము కూడా బెంగళూరులో కోటి రూపాయలకు పైగా పండ్ల వ్యాపారులకు అప్పు ఇచ్చామని ఈ వర్షాభావ పరిస్థితుల వల్ల కొంత నష్టం వాటిల్లిందని ఆరు నెలల సమయం కావాలని వేడుకొన్న సమయం ఇవ్వకపోగా తమ ఇంటి వద్ద గుంపుగా వచ్చి తిష్ట వేసి వేధిస్తున్నారని వాపోయారు. వారి వేధింపులకు తాళలేకనే ఈ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డామని ఆమె చెప్పారు. తన తాళిబొట్టు సైతం అమ్మి వారికి డబ్బు కట్టానని కొంత సమయం ఇచ్చి ఉంటే వారి డబ్బు వసూలు చేసి ఇచ్చేవారేమని అన్నారు. తన భర్తను మాట్లాడుదాం రా అని కారులో తీసుకెళ్ళి బెదిరించారని చెప్పారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు

పోలీసుల అదుపులో నిందితుడు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని శాంతినగర్ లో ఓ బాలిక పట్ల మహబూబ్ బాషా అనే వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులతోపాటు స్థానికులు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేళాపురంలో నివాసముంటున్న బాలిక తమ అమ్మమ్మ ఇంటికి వెళ్లి పిల్లలతో కలిసి ఆడుకుంటుండగా బాలికను మహబూబ్ బాషా పిలిచి అసభ్య ప్రవర్తన చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇతనిపై పోక్స్ చట్టం కింద కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. కాగా శాంతినగర్ ప్రాంతంలో మరి కొంతమంది యువకులు ఇలాగే మహిళలు, బాలికలపై అసభ్య ప్రవర్తన చేస్తూ అకృత్యాలకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మద్యం మత్తులో యువకులు బాలికలు, మహిళల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం మద్య నిషేధాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా స్థానికుల నుండి ఫిర్యాదు అందుకున్న పోలీసులు బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన మహబూబ్ బాషాను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రెగ్యులర్ అధికారులను నియమించాలని ధర్నా

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలానికి రెగ్యులర్ తహశీల్దార్, ఎంపిడిఒ, సబ్ రిజిస్ట్రార్ అధికారులను వెంటనే నియమించాలని, అన్ని పంచాయతీలకు విఆర్వోలు, రెండు ఆర్ఐ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. భూ సమస్యలు, రెవెన్యూ సేవలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, 1-బి తహశీల్దార్ లాగిన్‌లోకే వచ్చినా కూడా రిజెక్ట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ప్రజల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా, కూటమి ప్రభుత్వం మౌనం వహించడం బాధాకరమన్నారు. బేటలోని భూములలో జరిగిన అవకతవకలపై విచారించాలని, నచ్చని వారిని డిప్యుటేషన్ పేరుతో మార్చడం మానుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో భూ సమస్యలు కుప్పలుగా పేరుకుపోయాయని, ప్రజలకు న్యాయం చేయాలంటే రెగ్యులర్ తహశీల్దార్, ఎంపిడిఒ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామచంద్ర, రమేష్, మంజునాథ్, భూమారెడ్డి, నరసింహ, అశ్వత్థరెడ్డి, నారాయణప్ప, నాగరాజు, గోపాలప్ప, షామీ, రాజమ్మ, నాగమణి, రాధిక, ముబీనా, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన సిపిఎం నాయకులు, ప్రజలు

తాగునీటి కోసం ఆందోళన

ప్రజాశక్తి-గాండ్లపెంట

తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ముద్దన్నగారిపల్లి గ్రామ ప్రజలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. మండలంలోని కటారుపల్లి పంచాయతీ ముద్దన్నగారిపల్లికి చెందిన పలువురు ప్రజలు ఉదయం 9 గంటలకే ఎంపిడిఒ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ గ్రామంలో దాదాపు 30 కుటుంబాలు ఉండగా తాగునీటి మోటారు పాడై 4 నెలల నుంచి తాగునీటి సమస్య తీవ్రమైందన్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ, పంచాయతీ కార్యదర్శి, సర్పంచిలకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్నారు. విధి లేని పరిస్థితుల్లో ప్రజలే ఇంటింటా చందాలు పోగు చేసి రూ. 10వేలు ఖర్చు చేసి బోరు మోటారు మరమ్మతులు చేయించామన్నారు. పది రోజుల తర్వాత మళ్లీ బోరు మోటారు కాలిపోయిందన్నారు. దీంతో మరోమారు అధికారులకు ఫిర్యాదు చేసినా కాలయాపన చేస్తున్నారే కానీ సమస్యను పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన అధికారులు వెంటనే బోరు మోటారు మరమ్మతులు చేయించి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ధర్నాలో గ్రామస్తులు ఈశ్వరమ్మ, అశ్విని, అనిత, పాపిరెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన ప్రజలు

అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఓబులదేవరచెరువు

నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి స్పష్టం చేశారు. నిరుపేదల నివాస స్థలాల కోసం తక్షణం ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని వారు మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వారు మంగళవారం మామిళ్లకుంట్లపల్లి పంచాయతీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములతో పాటు గతంలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఎన్టీఆర్ కాలనీ, తదితర ప్రాంతాలను వారు స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. ముందుగా వడ్డెర కమ్యూనిటీ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. అక్కడ నిర్మాణ పనులకు ఎదురవుతున్న అడ్డంకులపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్ అధికారులు సమన్వయంతో పని చేసి పనులు వేగవంతం చేసేలా చూడాలని ఆదేశించారు. అనంతరం మహమ్మదాబాద్ క్రాస్, వేమారెడ్డిపల్లి, కొండకమర్ల జంక్షన్, ఎం.కొత్తపల్లి రెవెన్యూ పొలం, ఇనుగురాయి పొలంలోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. ప్రభుత్వ భూములు ప్రజా అవసరాల కోసం ఉపయోగపడేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎన్టీఆర్, వడ్డే ఓబన్న, శ్రీకృష్ణదేవరాయలు, యోగివేమన, తదితర ప్రముఖుల విగ్రహాల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. త్వరలో ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు, ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేస్తుందన్నారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, నాయకులు ఓబులరెడ్డి, సొసైటీ అధ్యక్షులు తుమ్మల మహబూబ్ బాషా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు నిజాం, కంచి సురేష్, మస్తానమ్మ, డాక్టర్ జాకీర్, అంజనప్ప, శ్రీనివాసులు, పీట్ల సుధాకర్, వీరాంజనేయులు ఉన్నారు.

పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

చెట్ల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-పరిగి

చెట్ల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని అటవీ శాఖ అధికారి కుళ్లాయప్ప తెలిపారు. కార్తీక వన మహోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని సేవామందిర్ విభిన్న ప్రతిభావంతుల పాఠశాల ఆవరణలో ప్రిన్సిపల్ రాజేశ్వరి, అటవీశాఖ అధికారులు కుళ్లాయప్ప, రామాంజనేయులులు మొక్కలు నాటారు. వారు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఇదిలా ఉండగా ప్రిన్సిపల్ జీవిల పాఠశాలలో సుమారు 20 చెట్లను తొలగించగా గ్రామస్తులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయగా ఆయన సమస్యను డిఎఫ్ఓ చక్రపాణి, రేంజర్ శ్రీనివాస్‌రెడ్డిలకు బదలాయించారు. దీంతో అటవీ శాఖ అధికారులు పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టగా ప్రిన్సిపల్ ప్రాయశ్చిత్తంగా రెట్టింపు సంఖ్యలో మొక్కలు నాటేందుకు ముందుకొచ్చారు. దీంతో అటవీ శాఖ అధికారులు, ప్రిన్సిపల్, ఫిర్యాదుదారులు కలిసి పాఠశాల ఆవరణలో 50కి పైగా మొక్కలు నాటారు. గ్రామస్తులు ఫిర్యాదును వాపసు తీసుకున్నారు.

తలుపుల : మండలంలోని వేవమానిపేట గ్రామ ఎంపిపి స్కూల్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'అడవుల రక్షణ-వన్యప్రాణుల సంరక్షణ' అంశంపై అవగాహన కల్పించారు. కుర్లీ ఇన్‌ఛార్జి సెక్షన్ ఆఫీసర్ ప్రదీప్ మాట్లాడుతూ మానవుని దైనందిన జీవితంలో అడవులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో ప్రభావం చూపుతున్నాయన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. హెచ్ఎం చలపతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఓ మొక్క నాటి, దానిని దత్తత తీసుకున్నప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రాయసం హరిప్రసాద్, నరసింహమూర్తి, రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిగిలో అటవీశాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్

రైతాంగానికి చేయూత

కేంద్ర సహకార మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్

ప్రజాశక్తి-చిలమత్తూరు

రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ, రైతాంగం అభివృద్ధికి కృషి చేస్తామని కేంద్ర సహకార మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్ తెలిపారు. వ్యవసాయశాఖ రూపొందించిన యాప్‌లలో వివరాలు తెలుగులో ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. మండలంలోని మరవ కొత్తపల్లిలో మంగళవారం ఆయన రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈక్రాప్ బుకింగ్ ఎలా చేస్తున్నారని ఆరా తీశారు. రైతులకు అర్థమయ్యేలా యాప్‌ల గురించి వివరించాలని సూచించారు. ఈ క్రాప్ వివరాలతో కూడిన ఓ ప్రతిని రైతుకు ఇవ్వాలన్నారు. మండలంలో మొక్కజొన్న పంట ఎక్కువగా సాగు చేస్తున్నామని, గిట్టుబాటు ధర లేక అవస్థలు పడుతున్నామని రైతులు తెలుపగా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వ్యకాసం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, రైతులు ఆయన్ను కోరారు.

సెజ్ పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలి

సెజ్ పేరుతో ప్రభుత్వం రైతుల నుంచి సాగు భూములు సేకరిస్తోందని, బలవంతంగా లాక్కోనేందుకు కూడా వెనకాడబోవడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రవీణ్‌కుమార్, రైతులు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఆ వివరాలన్నీ తనకు అందించాలని ఆర్డీఓ ఆనంద్ కుమార్‌ను ఆదేశించారు. వారి వెంట డాట్ సెంటర్ కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు, ఎడిఎ కృష్ణానాయక్, తహశీల్దార్ వెంకటేష్, హార్టికల్చర్ అధికారి మహేష్ నాయక్, ఏఓలు కవితారాణి, సురేంద్రనాయక్, ఏఈఓలు మల్లికార్జున, శ్రీవిద్య, రైతులు మదన్‌మోహన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, జయచంద్రారెడ్డి, అశ్వర్థరెడ్డి, శంకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటను పరిశీలిస్తున్న కేంద్ర సహకార మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా ఉన్న అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం 3 నెలలు గడువు పొడిగించిందని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ ప్రధాన కార్యదర్శి కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్లను ప్రణాళిక పరిధిలోకి తీసుకురావడమే ఉద్దేశంగా ప్రభుత్వం నిర్ణయిం చిందన్నారు.

బిసి హాస్టల్ పరిశీలన

ప్రజాశక్తి-చిలమత్తూరు

స్థానిక బాలుర బిసి హాస్టల్‌ను మంగళవారం ప్రజా సంఘాల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు హాస్టల్ ఆవరణలో మురుగు నీరు నిలిచి పాచిపట్టడం గమనించారు. దోమలు వృద్ధి చెంది విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారున. హాస్టల్ ప్రాంగణాన్ని తక్షణమే శుభ్రం చేయాలని ప్రజా సంఘాల నాయకుడు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

విద్యార్థుల ట్రంక్ పెట్టెలు అమ్మిన వాచ్‌మెన్

స్థానిక బిసి హాస్టల్‌లో విద్యార్థుల ట్రంకు పెట్టెలను పాత సామాన్లు అమ్మే వారికి విక్రయిస్తూ వాచ్‌మెన్ చంద్ర పట్టుబడ్డాడు. ప్రజా సంఘాల నాయకులు హాస్టల్ పరిశీలనకు వెళ్లినప్పుడు ఈ విషయం బహిర్గతమైంది. మొదట ట్రంకు పెట్టెలు ఎవరివి అని అడగ్గా వాచ్‌మెన్ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అయితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించడంతో అసలు విషయాన్ని ఒప్పుకున్నాడు. ఈ ఘటనపై ప్రజా సంఘాల బృందం వార్డెన్ శ్రీనివాసులుకు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకుని పరిశీలించారు. వాచ్‌మెన్‌పై అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారిణి లీలావతికి ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న ఆమె అక్కడికి చేరుకుని ప్రజాసంఘాల నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్‌తో మాట్లాడారు. వాచ్‌మెన్ చేసిన తప్పు ఒప్పుకోవడంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఆమె తెలిపారు.

ట్రంక్ పెట్టెలను కిందకు దింపిస్తున్న వాచ్‌మెన్

రెడ్డప్పరెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

జడ్పీ మాజీ చైర్మన్ మృతికి ఎమ్మెల్యే నివాళి

తనకల్లు : మండలంలోని పరాకువాండ్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, జడ్పీ మాజీ చైర్మన్, ఎడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా పని చేసిన దేశాయి రెడ్డప్పరెడ్డి సోమవారం కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలియడంతో మంగళవారం ఉదయం కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆ గ్రామం వెళ్లి రెడ్డప్పరెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, నాయకులు ఉన్నారు.

ముదిగుబ్బలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ముదిగుబ్బలో రైల్వేలైన్ మీటర్ గేజ్ నుంచి బ్రాడ్ గేజ్‌గా మారితే స్థానిక స్టేషన్‌లో మరిన్ని రైళ్లు ఆగుతాయని, తద్వారా ఈ ప్రాంత ప్రజలకు రైలు ప్రయాణం మరింత సులభతరం అవుతుందని ఆశ పడ్డారు. అయితే స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం సాధారణ రైళ్లు మాత్రమే ఆగుతున్నాయని, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడం లేదని ఈ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ప్రధానంగా అరుణాచలం మీదుగా వెళ్లే కాచిగూడ-మధురై ఎక్స్‌ప్రెస్, సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్, నాగర్‌కోయిల్, అమరావతి ఎక్స్‌ప్రెస్‌లు ఆగితే బావుంటుందని కోరుతున్నారు.

పిహెచ్‌సిని సిహెచ్‌సిగా మార్చేందుకు కృషి

ప్రజాశక్తి-గుడిబండ

గుడిబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పిహెచ్‌సి) కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సిహెచ్‌సి)గా మార్చేందుకు తమ వంతు కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి హామీ ఇచ్చారు. పిహెచ్‌సిలో మంగళవారం పాత్రికేయులు షబ్బీర్ ఏర్పాటు చేయించిన కంటి వైద్య శిబిరాన్ని వారు సందర్శించారు. అనంతరం పిహెచ్‌సిని పరిశీలించి ఓపీ గురించి డాక్టర్ శివానంద్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలపై రోగులతో వాకబు చేశారు. గుండుమల తిప్పేస్వామి బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి ఫీల్డ్ ఆఫీసర్ శివప్రకాష్‌తో మాట్లాడుతూ మీ యాజమాన్యంతో మాట్లాడి ఇక్కడ సిహెచ్‌సి సెంటర్ ఏర్పాటు చేయడానికి అనుమతి తీసుకోవాలని సూచించారు. అవసరమైన స్థలంతో పాటు బిల్డింగ్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందించడంతో పాటు నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్, ఆర్ఐ నేలకోటప్ప, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, డైరెక్టర్లు ప్రకాష్, సన్నలింగప్ప, ఎంపిటిసి శశిధర్, నాయకులు శివకుమార్, దుర్గేష్, మంజునాథ్, బాది పల్లప్ప, గుడిబండ చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు నిరంజన్, శ్రీరామప్ప, చంద్రప్ప నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం పాత్రికేయులు షబ్బీర్ తల్లిదండ్రులు అస్మత్‌ఉన్నీసా, అబ్దుల్ హమీద్‌ఖాన్ జ్ఞాపకార్థం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 172 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అందులో 117 మందిని శస్త్రచికిత్స కోసం బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రికి బస్సులో ఉచితంగా తీసుకెళ్లారు. వారికి అక్కడ వైద్య నిపుణుల చేత ఉచితంగా ఆపరేషన్ చేయించడంతో పాటు అద్దాలు, లెన్స్‌లు అవసరమైతే వాటిని కూడా ఉచితంగా అమర్చి మళ్లీ ఇంటికి చేర్చుతారని షబ్బీర్ తెలిపారు. వారికి ఉచిత భోజన వసతులు కూడా కల్పిస్తారన్నారు. శిబిరంలో సీనియర్ పాత్రికేయులు బి.నాగరాజు, రాజ్‌కుమార్, రంగనాథ్, ఎస్‌హెచ్. రాయుడు, శ్రీధర్, తిప్పేస్వామి, రంగధామప్ప, రాయుడు, శంకర్ కంటి ఆసుపత్రి ఫీల్డ్ ఆఫీసర్ శివప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు ఆర్థికసాయం

గోరంట్ల : మండలంలోని మల్లాపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త నారాయణమూర్తి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపిపి విద్యాధరణి, టిడిపి జిల్లా కార్యదర్శి దేవా, నర్సింహప్ప, ఫిరోజ్‌ఖాన్ మంగళవారం ఆ గ్రామం వెళ్లి నారాయణమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఆర్థిక సాయం అందజేశారు. మీ కుటుంబానికి తమతో పాటు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

తహశీల్దార్ కార్యాలయం మార్పు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని మారుస్తున్నట్లు తహశీల్దార్ దేవేందర్‌నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తహశీల్దార్ కార్యాలయాన్ని సచివాలయం-2 కార్యాలయంలోకి మార్పు చేస్తు న్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఏదైనా పని ఉంటే సచివాలయం-2లో సంప్రదించాలని సూచించారు. అలాగే తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలం దరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సారగొల్లపల్లి, పెడబల్లి, ఎల్లంపల్లి, నల్లగుం ట్లపల్లితండా ప్రజలు, నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

మండలంలోని కుమ్మరవాండ్లపల్లి సమీపంలో ఉన్న మార్కెట్ యార్డ్‌ను మరింత అభివృద్ధి చేసి క్రయవిక్రయాలకు మెరుగైన మార్గాన్ని చూపిస్తామని యార్డ్ వైస్ ఛైర్మన్ గంగయ్యనాయుడు తెలిపారు. యార్డ్ ఆవరణలో త్వరలోనే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన మంగళవారం మార్కెట్ యార్డ్‌ను సందర్శించి పశువుల సంతలో కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపా యాలపై రైతులను ఆరా తీయగా సంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల కోసం త్వరలోనే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. పశువులు నీరు తాగడానికి ప్రస్తుతం ఉన్న తొట్టెలతో పాటు మరికొన్ని తొట్టెలు ఏర్పాటు చేస్తామన్నారు. మౌలిక సదుపాయాలు మరింత మెరుగ్గా అభివృద్ధి చేసి వ్యాపారులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వర్షం కురుస్తున్నా రైతులు వ్యాపారానికి ముగ్గు చూపుతున్నా రంటే వారికి సహకరించాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎఆర్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు ప్రారంభించారు. రెడ్ క్రాస్ సొసైటీ, హిందూపురం బ్లడ్ బ్యాంక్ సెంటర్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో పోలీస్ సిబ్బంది, సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. ఎఆర్ డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. రక్తదానంపై అపోహలు వద్దని, ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు వలి, మహేష్, రవికుమార్, రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ విశ్వనాథ్, ట్రెజరర్ శివశంకర్‌రెడ్డి, మల్లికార్జున, డాక్టర్లు ప్రణయ్, రిషిత, ఆర్ఎస్ఐలు వీరన్న, వెంకటేశ్వర్లు, ప్రదీప్‌సింగ్, ప్రసాద్, కోఆర్డినేటర్ రమేష్, హిందూపురం బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న పోలీసులు

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి-గుడిబండ

ప్రభుత్వం రైతుల కోసం సింగిల్‌విండో కార్యాలయం ద్వారా రాయితీపై సరఫరా చేస్తున్న యూరియాను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సక్రమంగా పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, ఇన్‌ఛార్జి సీఈవో భోజన్నకు సూచించారు. ఆయన మంగళవారం గోదాములను సందర్శించి నిల్వ ఉంచిన ఎరువులను పరిశీలించారు. రైతులకు అవసరమైన ఎరువులు తెప్పించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలన్నారు. సింగిల్ విండో ద్వారా రైతులకు అవసరమైన రుణాలు పంపిణీ చేయడమే గాక డైరీకి అవసరమైన పాడి పశువులను కూడా ఇచ్చి ఆదుకోవాలని సూచించారు. మద్దనకుటప్ప, భోజన్న మాట్లాడుతూ ప్రస్తుతం సింగిల్‌విండో కార్యాలయంలో యూరియా నిల్వలు ఉన్నాయని, 48 కిలోల బస్తాకు రూ. 280 చెల్లించి రైతులు తీసుకెళ్లవచ్చన్నారు. వారి వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, నాయకులు శివకుమార్, దుర్గేష్, మంజునాథ్, సాగునీటి సంఘం అధ్యక్షులు నిరంజన్, రైతులు ఉన్నారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ శాసనమండలి సభ్యురాలు కల్పలతకు వైఎస్ఆర్‌టిఎ జిల్లా అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు సుబ్బారెడ్డి వినతి పత్రం సమర్పించారు. మంగళవారం కదిరికి వచ్చిన ఎమ్మె ల్సీని వారు మర్యాదపూర్వకంగా కలిసి ఉపాధ్యాయుల సమస్యలను వివరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై యాప్‌లు, మూల్యాంకన పుస్తకాల భారం తగ్గించాలని, ఆన్‌లైన్, బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, ప్రభుత్వ పాఠశాలను పరిరక్షించాలని, తదితర అంశాలను ఆమెకు వివరించారు. ప్రధానంగా ఎన్నికల హామీలను అమలు చేయాలని, పిఆర్‌సి కమిటీ నియామకం, ఐఆర్ ప్రకటన, పెండింగ్ బకాయిలు, తదితర అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ మండలిలోని సహచర సభ్యులతో కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-లేపాక్షి

మొంథా తుఫాన్ కారణంగా భారీ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. మట్టి మిద్దెల్లో నిద్రించరాదన్నారు. వర్షాలు తగ్గే వరకూ సమీప ప్రభుత్వ భవనాల్లో ఉండాలన్నారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు, నీరు, కాలువలు, చెరువుల వద్దకు వెళ్లవద్దన్నారు. అసాధారణ పరిస్థితులు తలెత్తితే వెంటనే తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ 90005 87412, 99490 49656లో సంప్రదించాలన్నారు.

పంచాయతీల్లో సంపద సృష్టిపై శిక్షణ

ప్రజాశక్తి లేపాక్షి

పంచాయతీల్లో సంపద సృష్టిపై స్థానిక ఉర్దూ స్కూల్‌లో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం పంచాయతీల్లో ఆదాయ వనరులు ఎలా సమీకరించుకోవాలి, వాటిని పంచాయతీల అభివృద్ధికి ఎలా ఖర్చు చేయాలి, తదితర అంశాలపై శిక్షకులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహమూర్తి, డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు, కుళ్లాయప్ప, పంచాయతీ కార్యదర్శులు రమేష్‌బాబు, దుర్గయ్య, మల్లికార్జున, సాయిప్రసాద్, శశికళ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ : పంచాయతీల్లో ఆదాయ వనరులపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. 15వ ఫైనాన్స్ నిధులపైనే ఆధారపడకుండా సొంత ఆదాయ వనరులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నారాయణస్వామి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నసీమా, డిప్యూటీ ఎంపిడిఒ దివాకర్ పాల్గొన్నారు.

కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే సన్మానం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

షెడ్యూల్ కులాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులను మంగళ వారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సన్మానించారు. కమిటీ ఛైర్మన్ వర్ల కుమార్ రాజాతో పాటు శాసనసభ్యులు రోషన్‌కుమార్, విజయానంద్, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మకు సింధూర పూలబొకే అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం వారికి తేనేటి విందు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, తదితర అంశాలపై వారు చర్చించారు. వారితో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఉన్నారు.

ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం గోపాల్, కోఆర్డినేటర్ వెంకటేష్ సూచించారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్-14, 17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అండర్-14 బాయ్స్ కబడ్డీ పోటీల్లో తలమర్ల, కొత్తచెరువు పాఠశాలలు, ఖోఖోలో కొత్తచెరువు, చిన్నరాశిపల్లి పాఠశాలలు, షటిల్‌లో కొడపగానిపల్లె, బండ్లపల్లి పాఠశాలలు, చెస్‌లో కొడపగానిపల్లి, కొత్తచెరువు పాఠశాలలు, అండర్-17 ఖోఖోలో తలమర్ల, కొత్తచెరువు పాఠశాలలు, కబడ్డీలో కొత్తచెరువు, తలమర్ల పాఠశాలలు, షటిల్‌లో కొడపగానిపల్లి, చిన్నరాశిపల్లె పాఠశాలలు, చెస్‌లో కొడపగానిపల్లి, కొత్తచెరువు పాఠశాలలు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి. కార్యక్రమంలో పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భూ సమస్యపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-చిలమత్తూరు

తాము వారసత్వంగా అనుభవిస్తున్న భూములపై కొందరు అక్రమంగా హక్కులు పొందేందుకు 1-బి కోసం దరఖాస్తు చేసుకున్నారని మొరసరపల్లి పంచాయతీ దొరణాలపల్లి గ్రామానికి చెందిన శెట్టి నాగార్జునరెడ్డి తహశీల్దార్ వెంకటేష్‌కి ఫిర్యాదు చేశారు. మొరసరపల్లి గ్రామ పరిధిలో తాను అనుభవి స్తున్న భూములపై హక్కు లేని వ్యక్తులు పట్టాదారు పాస్ పుస్తకం కోసం ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూములు తనకు వారసత్వంగా వచ్చాయని, కుటుంబ తగాదాల కారణంగా కొంతకాలంగా వివాదంలో ఉన్నాయని నాగార్జునరెడ్డి వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇతరులకు పట్టాదారు పాస్ పుస్తకం చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన తహశీల్దార్‌ను కోరారు.

పెచ్చులూడుతున్న సచివాలయ భవనం

బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధుల నిర్వహణ..

నిర్మాణం పూర్తవని నూతన భవనం..

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని పందిపర్తి గ్రామంలో పాఠశాలకు చెందిన పాత భవనం ఉంది. దీంతో వైసిపి హయాం నుంచే ఆ భవనంలో తాత్కాలికంగా సచివాలయం ఏర్పాటు చేశారు. నేటికీ అందులోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఈ భవనం చాలా చిన్నదిగా ఉండటంతో ప్రజలు సమస్య లపై వస్తే విధుల నిర్వహణలో సిబ్బందికి సమస్యలు తలెత్తేవి. దీనికి తోడు పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా పైకప్పు కారి సచివాలయం మొత్తంగా జలయమం అవుతోంది. దీంతో గత ప్రభుత్వమే సచివాయానికి నూతన భవనం మంజూరు చేసింది. అయితే గుత్తేదారుడు భవన నిర్మాణ పనులు పూర్తి చేసినా కిటికీలు, తలుపులు, విద్యుత్, తదితర పనులు చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాన్ని పూర్తి చేయడమా లేక మరొక భవనంలోకి సచివాలయ కార్యాలయాన్ని మార్చాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.

పెచ్చులూడిన గోడ

సచివాలయ భవనం